వీధిదీపాల సమస్యలను

త్వరలో పరిష్కరిస్తాం

ముషీరాబాద్ జీహెచ్‌ఎంసీ స్ట్రీట్ విభాగం డీఈ అశోక్

ఇంటర్వ్యూ...



రాంనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని రాంనగర్, అడిక్‌మెట్, ముషీరాబాద్, కవాడిగూడ, గాంధీనగర్, భోలక్‌పూర్ డివిజన్లలోని పలు వీధులు, పార్కులు, క్రీడా మైదానాలలో విద్యుత్ దీపాల సమస్యలు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ముషీరాబాద్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ స్ట్రీట్ విభాగం డీఈ బి.అశోక్ తెలిపారు. వెలగని వీధిదీపాల స్థానంలో వీలైనంత త్వరగా కొత్తవి అమర్చి రాత్రి వేళల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీధిదీపాలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు చేపడుతున్నామన్నాని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు.

ముషీరాబాద్ నియోజకవర్గంలో చాలా బస్తీలు, కాలనీల్లో రాత్రి సమయాల్లో వీధిదీపాలు వెలగకపోవడానికి కారణాలేంటి?

సర్కిల్ పరిధిలో అన్ని బస్తీలలో విద్యుత్ దీపాల సమస్యలు లేకుండా ప్రతీరోజు పర్యవేక్షణ చేస్తున్నాం. కాలనీలు, బస్తీలలో ఎక్కడైన వీధి దీపాలు వెలగక పోతే ఈ విషయాన్ని తమ దృష్టికి తెస్తే వెంటనే కొత్త విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తాం. రాత్రి వేళల్లో ప్రజల సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

పార్కులలో హైమాస్ట్ లైట్లు వెలగం లేదు. కొత్తవి ఎందుకు ఏర్పాటు చేయడం లేదు?

హైమస్ట్ లైట్ల సమస్య తమ దృష్టికి రాలేదు. కొన్ని చోట్ల కాలనీవాసుల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే తమ సిబ్బంది పంపి సమస్యను పరిష్కరించాం. ముషీరాబాద్ డివిజన్‌లోని వైఎస్ఆర్ పార్కులో హైమాస్ట్ లైట్ల సమస్య తమ దృష్టికి వచ్చింది. ఆ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నాం.

పార్సిగుట్ట ఈస్ట్ మున్సిపల్ కాలనీలోని జీహెచ్‌ఎంసీ మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో లైట్లు వెలగక క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఎప్పుడు పరిష్కరిస్తారు?

ఇండోర్ స్టేడియంలో విద్యుత్ దీపాల సమస్యను క్రీడాకారులు ఇటీవల జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌కు తెలియజేశారు. ఈ సమస్యపై కూడా స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్‌లు కూడా పలుమార్లు తమ దృష్టికి తీసుకురావడం జరిగింది. కొద్ది రోజుల క్రితమే జోనల్ కమిషనర్ రవికిరణ్ స్పందించి ఇండోర్ స్టేడియం నూతన లైటింగ్ సిస్టంకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించి టెండర్ ప్రక్రియ పూర్తి చేశాం. కొద్ది రోజుల్లోనే లైట్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తవుతుంది.

ఔరంగాబాద్ ఈస్ట్ కాంగ్రెస్ ఏసీగా సంగిశెట్టి



జగదీశ్వరరావు

చిక్కడపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ పక్షాన మహారాష్ట్ర ఔరంగాబాద్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ కో-ఆర్డినేటర్ (ఏసీ)గా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి జగదీశ్వరరావు నియమితులయ్యారు. ఆదివారం ఏఐసీసీ నేషనల్ వార్ రూమ్ చైర్మన్ ఎస్.శశికాంత్ సెంథిల్ ఉత్తర్వులు జారీ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్‌యాదవ్

భవిష్యత్ తరానికి హైడ్రా ఉపయోగపడుతుంది

రాంనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హైడ్రా చట్ట వ్యతిరేక చర్య కాదని, నగరంలో చెరువులు, నాలాల పరిరక్షణ కోసం సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న కబ్జాల నివారణ చర్యలని, ఇది భవిష్యత్ తరానికి ఉపయోగపడుతుందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో హైడ్రాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నవాడు, లేనివాడు అనే తేడా లేకుండా అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేసే విధంగా సీఎం హైడ్రాకు చట్ట బద్ధత కల్పించడం స్వాగతిస్తున్నామన్నారు. గత పదేళ్లలో నగరంలో అనేక చెరువులు, నాలాలు కబ్జాకు గురయ్యాయని వాపోయారు. నగరంలో అక్రమ నిర్మాణాలు, నాలాల కబ్జా వల్ల వర్షం నీరు సాఫీగా వెళ్లే దారిలేక ఇళ్లలోకి చేరడంతో ఆస్తి, ప్రాణనష్టం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, బాలస్వామి, వీరన్న, వెంకన్నగౌడ్, నదియా తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతదేహం స్వాధీనం



కవాడిగూడ: గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. 65 సంవత్సరాల వయస్సు గల వృద్ధుడు గాంధీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న మెట్రోస్టేషన్ వద్ద చనిపోయి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని వృద్ధుడి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించినట్లు గాంధీనగర్ సీఐ రాజు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 60140లో లేదా గాంధీనగర్ పీఎస్‌లో సంప్రదించాలని కోరారు.

గుండెపోటుతో ఆటోడ్రైవర్ మృతి



కిరణ్‌కుమార్ మృతదేహం

కవాడిగూడ: గుండెపోటుతో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లిలో నివాసం ఉండే కె కిరణ్‌కుమార్(34) వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. అతడికి భార్య కె రజిత, ఒక కుమార్తె ఉన్నారు. గత సంవత్సరంలో కిరణ్‌కుమార్ కాలును తొలగించారు. అప్పటినుంచి డిప్రెషన్‌లోకి వెళ్లి మద్యానికి అలవాటు పడ్డాడు. అయితే ఆదివారం మధ్యాహ్నం గాంధీనగర్ పీఎస్ పరిధిలోని జీరా ప్రాంతంలో పడిపోయి ఉన్నాడు. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అతడిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గమనించారు. కిరణ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు, అనంతరం ఆయన కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

సదర్‌కు తరలిన కాంగ్రెస్ నేతలు

చిక్కడపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు ఎన్టీఆర్‌స్టేడియం వద్ద నిర్వహించిన సదర్ సమ్మేళనానికి గాంధీనగర్ డివిజన్ నుంచి కాంగ్రెస్ నేతలు పెద్దఎత్తున తరలివెళ్లారు. కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ ఆధ్వర్యంలో చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద పూజ నిర్వహించి 500 మంది కార్యకర్తలు, నాయకులతో ర్యాలీగా దున్నపోతులను తీసుకుని సదర్‌కు ర్యాలీగా వెళ్లారు. పార్టీ నాయకులు గుర్రం శంకర్, చంద్రకళ, మారిశెట్టి నర్సింగ్‌రావు, జగదీష్‌బాబు, కృష్ణయాదవ్, వెంకటరమణ యాదవ్, నర్సింగ్‌ముదిరాజ్, శీలం సత్యనారాయణ పాల్గొన్నారు.



గోల్కొండ చౌరస్తా నుంచి రీసాలబస్తీకి వెళ్లే రోడ్డుపై గుంతలు



హరినగర్ అబ్బసాయి మెన్షన్ చౌరస్తా రోడ్డును తవ్వి మట్టిని తొలగించని వైనం

అధ్వానంగా రోడ్లు

- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



రాంనగర్‌లోని ఎస్ఆర్‌టీ పార్కు సమీపంలో తవ్వి వదిలేసిన రోడ్డు

రాంనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో పలు రోడ్లు అధ్వానంగా మారాయి. ఈ రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నూతన రోడ్లు నిర్మించేందుకు రోడ్లను తవ్వి నెలల తరబడి అలాగే వదిలి వేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మరికొన్ని చోట్ల రోడ్లపైనే మట్టికుప్పలు వదిలేశారు. దీంతో బస్తీలోని రాకపోకలు నిలిచిపోయియి. అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్ సౌమ్య ఆస్పత్రి పక్కన గల స్ట్రీట్ నెంబర్ 18లో, లోటస్ స్కూల్ నుంచి రామాలయం వెళ్లే రోడ్డులో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్ల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ డివిజన్‌లోని లక్ష్మమ్మ పార్కు వద్ద రోడ్డు తవ్వి మరమ్మతులు చేయకుండా అలాగే వదిలేశారు. ముషీరాబాద్ డివిజన్ అజర్ గల్లీలో రోడ్లు అధ్వానంగా మారాయి. నియోజకవర్గంలోని పలు చోట్ల కంకరతేలి, గుంతలు పడి ఉండడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రాంనగర్ డివిజన్‌లోని ఎస్ఆర్‌టీ పార్కు సమీపంలో నూతన రోడ్డు కోసం రోడ్డును తవ్వి కొత్త రోడ్డు వేయలేదు. హరినగర్ అబ్బసాయిచౌరస్తాలో నూతన రోడ్డు కోసం రోడ్డు తవ్వారు కానీ మట్టికుప్పలు తొలగించలేదు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గోల్కొండచౌరస్తా నుంచి రీసాలబస్తీకి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. దీని కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతుకు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మురారీ పల్లెలోని డబుల్ ఇళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

రాంనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మురారీ పల్లెలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం ముషీరాబాద్ నియోజకవర్గం కార్యదర్శి దశరథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో మురారీ పల్లెలోని డబుల్ బెడ్ రూం ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, హైదరాబాద్ సిటిజన్స్ ఫోరంల సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కరెంట్ మీటర్లు, తాగునీరు, లిఫ్ట్, జనరేటర్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఆర్.వెంకటేష్, కె.రమేష్, మహేందర్, విజయ్‌కుమార్, శివశంకర్ పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం పొందిన దశరథ్

నల్లకుంట: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించిన 2024 - 26 రెండు సంవత్సరాల పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా అంబర్‌పేట నియోజకవర్గంలోని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ లక్ష రూపాయలు చెల్లించి ఆన్‌లైన్‌లో పార్టీ శాశ్వత సభ్యత్వం పొందారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను 1996 నుంచి పార్టీలో పనిచేస్తున్నానని తెలిపారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లను నియమించాలి

తెలంగాణ మున్నూరుకాపు యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు దశరథం పటేల్



సమావేశంలో మాట్లాడుతున్న ఆరే దశరథం పటేల్

రాంనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లను నియమించాలని మున్నూరుకాపు యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆరే దశరథం పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం చిక్కడపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యధిక జనబలం గల మున్నూరుకాపుల అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు జీవో జారీ చేశారన్నారు. అయితే జీవో జారీ చేసి నెలలు గడుస్తున్న చైర్మన్, డైరెక్టర్లను నియమించక పోవడంతో ఆ జీవో కాగితాలకే పరిమితమైందన్నారు. మున్నూరుకాపు యువజన సంఘం మేడారం రాజేష్‌పటేల్, ప్రధాన కార్యదర్శి మహేందర్‌పటేల్, అభిషేక్, పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ 6 వేలకు పెంచాలి

చిక్కడపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పెన్షన్‌ను ఆరు వేలకు పెంచి వెంటనే అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య ప్రభుత్వాన్ని డి మాండ్ చేశారు. ఆదివారం ఆయన చిక్కడపల్లిలోని వేదిక రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. దివ్యాంగుల సమగ్ర అభివృద్ధికోసం ప్రత్యేక పథకం అమలుచేయాలని కోరారు.

'ఓబీసీ ఉద్యోగులకు అన్ని రంగాల్లో అన్యాయం'

బర్కత్‌పుర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఓబీసీలకు అన్నిరంగాల్లో అన్యాయం జరుగుతుందని, జాతీయస్థాయిలో బలమైన ఉద్యమం చేపట్టి కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామని ఆయన హెచ్చరించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆలిండియా బీఎస్ఎన్ఎల్ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ జాతీయ ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ భద్రత కల్పించాలని, క్రిమిలేయర్‌ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రజకుల అభివృద్ధి కోసం కృషి చేస్తా

- రాష్ట్ర ఫిషర్‌మెన్ ఫెడరేషన్ చైర్మన్ సాయికుమార్

రాంనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రజకుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వపరంగా కృషి చేస్తామని రాష్ట్ర ఫిషర్‌మెన్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తెలిపారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర రజక ఫిషర్‌మెన్ సొసైటీల కమిటీ వ్యవస్థాపక చైర్మన్ అమనుగంటి సైదులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నవంబర్ 25 నుంచి ప్రారంభమయ్యే సొసైటీ రిజిస్ట్రేషన్ అవగాహనయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జీవో నెంబర్ 343 ప్రకారం చెరువులలో దుస్తులు ఉతికే రజకకులకు ఆ చెరువుల్లో చేపలు పట్టే అవకాశం కల్పించి పరిశీలిస్తామన్నారు. కమిటీ వ్యవస్థాపక చైర్మన్ అమనుగంటి సైదులు మాట్లాడుతూ సొసైటీ రిజిస్ట్రేషన్ల అవగాహనను 33 జిల్లాల్లో రజకులకు ఈ యాత్ర ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రాజీవ్ చాకలి, ఉపాధ్యక్షుడు ఎన్.రాజశేఖర్; కోశాధికారి నేరెళ్ల కుమార్, ప్రధాన కార్యదర్శి యాదయ్య, నాయకులు రమేష్, రామస్వామి, మిట్టపల్లి శ్రీను పాల్గొన్నారు.

చిన్ననాటి నుంచే దేశభక్తిని పెంపొందించాలి

గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ముషీరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువతలో దేశభక్తిని మరింత పెంపొందించేదుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సూచించారు. ఆదివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్యభవన్‌లో భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో చిన్నారుల్లో దేశ భక్తిని పెంపొందించేందుకు దేశభక్తి బృందగానం పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ... వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం జరుగుతుందన్నారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను పిల్లల్లో చిన్ననాటి నుంచే బీజం వేయాలని సూచించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు యువతలో జాతీయ భావాజాలం, దేశభక్తి, క్రమశిక్షణ పెంపొందించేందుకు భారత్ వికాస్ పరిషత్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు డిసెంబర్ 15న బెంగళూరులో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. భారత్ వికాస్ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సతీష్‌గౌడ్, నాగరాజులు మాట్లాడుతూ.. ఈ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు అతిథులు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ సౌత్ భారత్ రీజనల్ ప్రధాన కార్యదర్శి పురుషోత్తంశాస్త్రి, సంయుక్త కార్యదర్శి నరేం ద్రకృష్ణ, నాయకులు నాగేందర్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజాలింగం, సత్యానారాయణ పాల్గొన్నారు.

మానసిక ఆనందానికి సంగీతం దోహదం



త్రినాథరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

చిక్కడపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సంగీతం మానసిక ఆనందానికి దోహదపడుతుందని ఎస్‌బీఐ మాజీఏజీఎం, ప్రముఖ గాయకుడు చిం తలపూడి త్రినాథరావు అన్నారు. ఆదివారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని సిటీకల్చరల్ సెంటర్‌లో ఆలాపన నూతన సాంస్కృతిక సంస్థ ప్రారంభోత్సవం సందర్భంగా 12 గంటలపాటు సినీ సంగీత విభావరి జరిగింది. ఈ సందర్భంగా గాయనీ గాయకులతోకలిసి గానం చేసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న త్రినాథరావుకు ఆత్మీయసత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, గాయకులు రాజ్ వేమూరి, గాయనీగాయకులు మంజుల, అను, పద్మజ, పద్మాప్రసాద్, సీత, అరుణ, సుశీల, పల్ల వి, రమ, మహేశ్వరి, హర్షారాక్స్ రాజ్, ధర్మారావు,చరణ్, శ్రీను, శేఖర్, జనార్దన్, బాబు, గంగాధర్ పాల్గొన్నారు.

సాహిత్య అవగాహనతోనే గొప్ప పాటలు రాయగలం

ప్రముఖ గేయరచయిత, సినీ ఆర్టిస్టు మౌనశ్రీ మల్లిక్



మాట్లాడుతున్న రాధాకృష్ణ, గేయరచయిత మౌనశ్రీమల్లిక్

రాంనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని సాహిత్యాన్ని చదివినప్పుడే గొప్ప పాటలు రాయగలం అని ప్రముఖ గేయ రచయిత, సినీ ఆర్టిస్టు మౌనశ్రీ మల్లిక్ తెలిపారు. సాహిత్య అవగాహనతోనే ఇండియన్ ఫైల్స్ అనే సినిమాలో తాను పాటలు రాయగ ఎం.ఎం.కిరవాణి పాడిన తిరిగి చూడు అనే పాట తనకు ఎన్నో అవార్డులు, ప్రశంసలు తెచ్చిపెట్టిందన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహిత్య అకాడమి 7వ తెలంగాణ రాష్ట్ర సదస్సు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎం.గౌతమ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మౌనశ్రీ మల్లిక్, బహుజన సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటీతరం యువత సాహిత్యంపై అవగాహన పెంచుకోవడానికి కృషి చేయాలన్నారు. నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ బహుజన సాహిత్యం ముందుకు తీసుకెళ్లడం కోసం వచ్చే డిసెంబర్ 10వ తేదీ దేశరాజధాని న్యూఢిల్లీలో వెయ్యిమందితో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అకాడమి సంస్థ కర్నాటక రాష్ట్ర అధ్యక్షురాలు ఎన్.డి.వెంకమ్మ, ఏపీ రాష్ట్ర కార్యదర్శి నేలపాల ఫణికుమార్, యూత్ కాంగ్రెస్ కార్యదర్శి మామిడాల సంతోష్‌రెడ్డి, నజర్‌పాషా, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్ష సాధింపులతోనే అరెస్టులు



జైసింహను అరెస్టు చేస్తున్న పోలీసులు

ముషీరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గం ఓరియెన్ విల్లాస్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇంట్లో తనిఖీలు చేసేందుకు పోలీసులు బలవంతంగా లోనికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులను అడ్డుకున్న ముషీరాబాద్ బీఆర్ఎస్ నాయకులను బలవంతంగా అరెస్టు చేసి వివిధ పోలీసుల చేస్టేషన్లకు తరలించారు. ఆదివారం ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ ఆధ్వర్యంలో కేటీఆర్ ఇంటికి వెళ్లి పోలీసులు ఆయన ఇంట్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో ముఠా జైసింహను అరెస్టు చేసి ఆర్‌కే పురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ముఠా జైసింహ మాట్లాడుతూ... ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్నందుకే కేటీఆర్‌పై కక్షసాధింపు ధోరణికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్నారు. ముషీరాబాద్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, దీన్‌దయాల్‌రెడ్డి, గాంధీనగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, ప్రవీణ్, షకీల్ అహ్మద్, సుధాకర్‌లను అరెస్టు చేశారు.

భాషాసాహిత్యాలలో ప్రతిభాశాలి దివాకర్ల

చిక్కడపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భిన్న భాషాసాహిత్యాలలో ప్రతిభాశాలి దివాకర్ల వెంకటావధాని అని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఆదివారం ఎందరో మహానుభావులు కార్యక్రమం పరంపరలో భాగంగా దివాకర్ల వెంకటావధాని సంస్మరణ సమావేశం కళా జనార్దనమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి మాట్లాడుతూ.. దివాకర్ల సాహిత్య పరిశోధకుడు, విమర్శకుడు పలు సాహితీవ్యాసకర్త అన్నారు. కీలక ప్రసంగం చేసిన ప్రముఖ విమర్శకులు, సాహితీవేత్త రమణ వెలమకన్ని మాట్లాడుతూ ఆయన శిష్యరికంలో ఎందరో ప్రముఖులుగా గుర్తింపు పొందారన్నారు. వారిలో సినారె లాంటి వారున్నారన్నారు.



ప్రసంగిస్తున్న మధుసూదనాచారి, పక్కన జనార్దనమూర్తి



ప్రముఖ రచయిత కంభాలపల్లి కృష్ణ రచించిన మాజీ ఎంపీ వి.హనుమంతరావు(వీహెచ్) బయోపిక్ 'అందరివాడు హన్మంతన్న' పుస్తకావిష్కరణ శనివారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కృష్ణగౌడ్, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, నాయకులు పొలినేని రామ్మోహన్‌రావు, చందుపటేల్ పాల్గొన్నారు. -నల్లకుంట, ఆంధ్రజ్యోతి

మండల స్వామి సాహితీ సేవలు నిరుపమానం

చిక్కడపల్లి: కవి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు డా.మండలస్వామి సాహితీసేవ నిరుపమానమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈనెల 18న మృతి చెందిన నల్లగొండ జిల్లాకు చెందిన మండలస్వామి సంతాపసభ ఆదివారం మధ్యాహ్నం చిక్కడపల్లిలోని సిటీసెంట్రల్ లైబ్రరీలో స్వామి మిత్రుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డా.నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞ చూపారని నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగురాజ్యం ప్రతినిధి గోపరాజు రవి, కవి తంగెళ్ళపల్లి కనకాచారి, కవుల సంఘం ప్రతినిధి సుతారపు వెంకటనారాయణ, దైవాధీనం పాల్గొన్నారు.

దేశంలో కనుమరుగవుతున్న చేతివృత్తులు

కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



కులవృత్తులకు చేయూతనిస్తున్న కేంద్ర ప్రభుత్వం

కవాడిగూడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో మారుతున్న పరిస్థితులు, ఎదురవుతున్న పోటీ కారణంగా చేతివృత్తులు కనుమరుగవుతున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. చేతివృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారిని ఆదుకోవడానికే కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ యోజన పథకం అమలు చేస్తోందని తెలిపారు. కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి ఈ పథకం కింద ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. విశ్వకర్మ యోజన పథకం ద్వారా కోట్లాది మంది ప్రజలకు వృత్తి నైపుణ్య శిక్షణ, ఉచిత పరికరాలు, ఆర్థిక సాయం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు. ఆదివారం కవాడిగూడ డివిజన్‌లోని లోయర్ ట్యాంక్‌బండ్ కుక్కలతూమ్ ధోబీఘాట్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి 26 లక్షల నిధులతో నూతనంగా నిర్మించ తలపెట్టిన కమ్యూనిటీ హాలును కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కవాడిగూడ కార్పొరేటర్ జి రచనశ్రీతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ధోబీ రజకాభివృద్ధి సంస్థ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ ఎం నర్సింహ, ధోబీఘాట్ ప్రతినిధులు సి కొమురయ్య, జె ముత్యాలు, బి చంద్రమోహన్, జె రాజశేఖర్, ఎ వెంకటేష్, జి.భాస్కర్, మాజీ కార్పొరేటర్ టి రవీందర్, బీజేపీ సీనియర్ నాయకులు జి వెంకటేష్, పరిమల్‌కుమార్, ఓబీసీ మోర్చానగర అధ్యక్షుడు నలంద్రి శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ కన్వీనర్ రమేష్‌రాం, పూసరాజు పాల్గొన్నారు.

- **సభ్యత్వ కార్డుల అందజేత**

కవాడిగూడ: బీజేపీ పార్టీలో సభ్యత్వం తీసుకున్న వంది మందికి ఆదివారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి వారికి కార్డులను అందజేశారు. కవాడిగూడ డివిజన్‌లోని 53 బూత్‌నెంబర్‌లో క్రియాశీలక సభ్యత్వం అయిన సందర్భంగా వారికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేతులమీదుగా కార్డులు అందజేసినట్లు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జిమీసాల విఠల్‌రావు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జి రచనశ్రీ, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఎంసి మహేందర్‌బాబు, కె పరిమళ్‌కమార్ తదితరులు పాల్గొన్నారు.

- **శుభాకాంక్షలు**



ఉస్మానియా యూనివర్సిటీ వీసీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ఎం కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాదిగ జర్నలిస్టు ఫోరం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం జహంగీర్, సామ్రాట్, అజయ్, వంశీ తదితరులు

- కవాడిగూడ, ఆంధ్రజ్యోతి